
# రాజ్ పాలన

గర్నెపూడి రాధాకృష్ణమూర్తి



"నువ్వు వాళ్ళ ఫిర్యాదు నిజమా కాదా అని తేల్చాలి. ప్రప్రథమంగా వాళ్ళు లోపాలు ఉన్నవి అంటున్న ఆ సరుకు అంతా మన తయారీ అవునా కాదా అని తెలుసుకోవాలి. ఒకవేళ అదే నిజమైతే ఆ కాంపొనెంట్సు అన్నీ స్పెసిఫికేషన్స్ ప్రకారం ఉన్నవో లేదో అంచనా వెయ్యాలి.

మన కాంపొనెంట్సు ఇంజన్‌లో బిగించిన తర్వాత ఇంజన్ ఎలా ప్రవర్తిస్తుందో సూక్ష్మంగా గమనించి చూడాలి. ఇవన్నీ మొదటినుంచి చివరిదాకా నువ్వు స్వయంగా పరిశీలించి తెలుసుకోవాలి. వాళ్ళ రిపోర్టులు వాళ్ళ అభిప్రాయాలు, అభియోగాలు నమ్మి వాటిమీద ఆధారపడకూడదు" జనరల్ మేనేజర్ రాజ్‌పాల్ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ శర్మకు చెపుతూండగా ఇంటర్‌కాం బజర్‌మోగింది. అంటే బయటనుంచి జనరల్ మేనేజర్‌కు ఫోను వచ్చిందన్నమాట. ఇంటర్‌కాంలో పర్సనల్ అసిస్టెంట్ లైన్‌లో ఎవరున్నారో చెబితే, అటు వ్యక్తి ప్రాముఖ్యత ఇటు మీటింగ్ బేరీజు వేసుకుని, ఫోన్‌లో మాట్లాడవలసిందీ లేనిదీ నిర్ణయించుకుంటాడు జనరల్ మేనేజర్.

"ఎస్ ఎస్ కనెక్ట్ చెయ్యి" రాజ్‌పాల్ పి.ఏ.తో ఇంటర్‌కాంలో చెప్పాడు.

"గుడ్ మార్నింగ్ సర్. ఎస్ సర్..

రాజ్‌పాల్‌నే మాట్లాడుతున్నాను సర్. హౌ ఆర్ యు సర్?"

"......."

"అవును సార్ నిన్ననే మీటింగ్ అయింది సర్!"

"...... " ఏ మీటింగ్, ఎవరు అవతలి వ్యక్తి అని ఊహించే ప్రయత్నంలో శర్మ.

"....."

"ఇంకా ఫైనలైజ్ చెయ్యలేదు సర్!" రాజ్‌పాల్.

"కన్‌దేశి ఒక్క నిమిషం సర్. లైన్‌లో ఉండండి సర్" అని ఒక చేత్తో ట్రంక్ లైను పట్టుకుని, రెండో చేత్తో బజర్ నొక్కి పి.ఏ.తో "వెంటనే అంబకుమార్‌కు కనెక్ట్ చెయ్" అని ఆదేశించి తిరిగి ట్రంక్ లైన్ లోకి "యస్ సర్! జస్ట్ ఒక్క నిమిషం సర్! హౌ ఆర్ యు సర్! అమెరికాలో మీ అబ్బాయి బాగున్నాడా సర్! ఆతనికి ఈ మధ్య అమెరికా అధ్యక్ష పురస్కారం ఇచ్చారని తెలిసింది. హార్టీ కంగ్రాచ్యులేషన్స్ సర్! చాలా సంతోషం" అన్నాడు.

అప్పుడు అర్థమైంది శర్మకు లైన్లో అటువైపు ఉన్నది తమ కంపెనీ టెక్నికల్ డెరెక్టర్ అని. ఇంతలో ఇంటర్‌కాం బజర్ మోగింది. అంబకుమార్ లైన్‌లోకి వచ్చాడన్నమాట.

"ఎక్స్‌క్యూజ్ మి సర్.. ఒక్క నిమిషం" అంటూ మళ్ళీ ట్రంక్ రిసీవర్ దూరంగా పట్టుకొని, ఇంకో చేత్తో ఇంటర్‌కాం రిసీవర్ తీసుకుని "అంతా జూనియర్ మేనేజర్స్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్‌లో కన్‌దేశికి ఎలాంటి గ్రేడు వచ్చింది?" అనడిగాడు.

"....."

"అలాగా? చాల తక్కువ!"

"......"

"సరే. థ్యాంక్స్" అంటూ ఇంటర్‌కాం ఫోన్ పెట్టేసి ట్రంక్ లైను తీసుకుని "హలో సర్.. సారీ సర్ కన్‌దేశికి మార్కులు సుమారుగానే వచ్చాయి సర్" అన్నాడు.

"......"

"అన్ని డిపార్ట్‌మెంట్స్ హెడ్స్ కలిసి చేసిన ఉమ్మడి నిర్ణయం. మీకు తెలియందేముంది సార్"

"......"

రాజ్‌పాల్ బుర్ర గోక్కోటం గమనించాడు శర్మ. జనరల్ మేనేజర్ ఏదో ఇరకాటంలో పడ్డట్లు తెలుస్తోంది. తను బయటకు వెళ్ళనా అన్నట్లు సైగ తోనే అడిగాడు. అక్కర్లేదు కూచో మన్నట్లు జనరల్ మేనేజర్ సైగలోనే జవాబిచ్చాడు. డైరెక్టర్‌తో మాట్లాడేటప్పుడు తన్ను అక్కడే ఉండమనేసరికి జి.ఎం.కి తను చేరువేనన్నట్లు తోచి శర్మకు లోపల సంతోషం కలిగింది.



## సజీవ చిత్రం

కళ్ళకొమ్మన కలలెన్నో
ఎన్నెన్నో...
రెమ్మరెమ్మన పూచే మిథ్యరంగులెన్నో
స్వప్నావస్థన కలకు విలువేముంది?
జాగ్రదావస్థన చెదిరిన కల
మిగులుతుంది.
కళ్ళు తెరచి వాస్తవాన్ని చూడగలిగితే
ఎందరి కనుల వెనుక ఎన్ని వ్యధల
గాథలు
కొన్నింటినయినా రూపుమాపే
ప్రయత్నం నీది కావాలి
అందుకే -
విలువలేని కలల నిస్తేజ చిత్రం
కాకూడదు
జీవితం!
వస్తు స్థితిని బదుకున కన్పయించే
సజీవ చిత్రం
కావాలి జీవితం!!

– రోహిణీ సత్య

"అవును సార్ ఫైలు మళ్ళీ తెరవాలంటే.." నీళ్ళు నమిలాడు జి.ఎం.

"కొంతవరకు సర్దినా ప్రమోషన్" అర్ధోక్తిలో ఆగిపొయ్యాడు జనరల్ మేనేజర్ రాజ్‌పాల్.

"......."

"అవును సర్. ఫోర్డ్ మోటార్స్ నించి వచ్చింది" సబ్జెక్ట్ మారిపోయింది. ఫోర్డ్ మోటార్స్ నుంచి వచ్చిన కంప్లెయింట్ వైపు తిరిగింది – శర్మ గమనిస్తున్నాడు.

"....."

"మనం మొత్తం పదిలక్షల పార్ట్స్ ఎగుమతి చేశాం సర్"

"....."

"విలువ మొత్తం ఎనిమిది కోట్లు ఉంటుంది సార్" అన్నాడు, "అవునా!" అన్నట్లు శర్మవైపు చూస్తూ. శర్మ అవునన్నట్లు తలూపాడు.

"....."

"మన క్వాలిటీ కంట్రోల్‌మేనేజర్ శర్మను పంపిస్తున్నాము సర్" తన పేరు టెక్నికల్ డైరెక్టర్‌తో ప్రస్తావనలో కొచ్చేసరికి శర్మకు తనే డైరెక్టర్ హోదాకు ఎదిగినట్లనిపించింది.

"....."

"అవున్‌సార్ ఛైర్మన్ అప్రూవర్ కూడా అయింది సార్"

"....."

"యస్ సర్. అలా చేస్తే చాలా బాగుంటుంది సర్"

"....."

"ఓ చాలా థాంక్స్ సర్."

"....."

"తప్పకుండా సర్. ప్రయత్నిస్తాం సర్"

"....."

"యస్ సర్. తప్పకుండా చేసే పూచీ నాది సర్"

"....."

"యస్ సర్. తప్పకుండా సర్" జనరల్ మేనేజర్ రాజ్‌పాల్ ముఖంలో సీరియస్‌నెస్ పోయి లాస్య రేఖలు చోటు చేసుకున్నాయి ఫోన్ పెట్టేసేసరికి.

"ఒకే శర్మ, ప్రస్తుతం మనం చర్చించిన పద్ధతిలో తయారవ్వు నువ్వు.

ఈ ట్రిప్‌కు నువ్వు తయారుచేసిన నోట్సు నాకు పంపించు. నేను ఒకవేళ ఆఫీసులో లేకపోయినా నా పి.ఏ. రామచంద్రంకు ఇచ్చి వెళ్ళు. అది చూసి ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే చెప్తాను."

"యస్ సార్.." శర్మ జనరల్ మేనేజర్ ఆఫీసు నుంచి బయటికొచ్చాడు. స్పెషల్ ఆటో ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆటోమొబైల్ స్పేర్‌పార్ట్‌లు తయారుచేసే ప్రభుత్వ యాజమాన్య సంస్థ. జపాన్ సాంకేతిక సహకారంతో స్థాపించిన సంస్థ. దేశంలో ఆటోమొబైల్ కంపెనీలకు



## అతను అదృష్టవంతుడే మరి!

కరిష్మాకపూర్ అడుగుజాడల్లోనే నడవాలని నిర్ణయించుకుందేమో కరీనా కపూర్! 'రాజా హిందూస్థానీ' సినిమాలో అమీర్‌ఖాన్‌తో కరిష్మా కపూర్ ఓ గాఢచుంభనంతో కనిపించిన దృశ్యాన్ని ప్రేక్షకులు మరువక ముందే కరీనాకపూర్‌కూడా అలాంటి దృశ్యంలో తెరపైన ప్రత్యక్షమవబోతోంది. ఫర్దీన్‌ఖాన్‌తో చేస్తున్న ఓ సినిమాలో కరీనా చుంభన దృశ్యంలో నటించింది. ఇన్నాళ్ళూ దానికి 'నో' అంటూ చెప్పి, ఇప్పుడెందుకిలా? అనడిగితే ఫర్దీన్ అదృష్టవంతుడు. అతనికే అలాంటి సీన్‌లో నటించే అవకాశమొచ్చిందంటూ జోకేసింది. ఆ సమయంలో సిగ్గు పడటం ప్రక్కనున్న ఫర్దీన్ వంతయింది.

సప్లయ్ చేయటమేగాక విదేశాలకు ఎగుమతులుకూడా చేసి అంతర్జాతీయంగా పేరు పొందిన సంస్థ. ఇటీవల అమెరికాలో ఫోర్డ్ మోటార్ కంపెనీకి ఎగుమతి చేసిన సరుకులో నాణ్యత లోపించిందని, పార్ట్‌లు ఒప్పుకున్న కొలతల ప్రకారం లేవని ఫిర్యాదు వచ్చింది. వెంటనే వెళ్ళి కంప్లెయింట్ పరిశీలించి కస్టమర్‌ని సమాధానపరచకపోతే ఆర్డర్స్ ఆగిపోవటం, కంపెనీకి చెడుపేరు రావటమేకాక కస్టమర్‌కు నష్టపరిహారం చెల్లించుకోవలసొస్తుంది. అందుకే కంప్లెయింట్ వచ్చిన తక్షణం ఈ సమస్య పరిష్కరించటానికి క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ శర్మను కస్టమర్ దగ్గరికి డెట్రాయిట్ పంపటానికి నిర్ణయించి, తగు ఏర్పాట్లలో ఉన్నారు. ఈ ఎగుమతి ఆర్డరు వచ్చినప్పటి నుంచి శర్మ అందులో పూర్తిగా నిమగ్నుడై ఉన్నాడు. అంతేకాక ప్రొడక్షన్ అయిన తర్వాత పార్ట్స్ అన్నీ అన్నివిధాలా పరీక్షించి సర్టిఫై చెయ్యాల్సిన బాధ్యత శర్మ డిపార్ట్‌మెంటుదే. అందుచేతనే ఈ సమస్య పరిష్కారానికి శర్మను డెట్రాయిట్ పంపటానికి నిర్ణయించారు.

❋ ❋ ❋

శర్మ వెళ్ళిన అరగంటకు పర్సనల్ రిపోర్టులు తీసుకుని అంబకుమార్ జనరల్ మేనేజర్ ఆఫీసుకు వచ్చాడు. రిపోర్ట్‌లతోబాటు నిన్న చర్చించి నిర్ణయించిన జూనియర్ మేనేజర్ల గ్రేడింగ్ జాబితా కూడా తెచ్చాడు. జనరల్ మేనేజర్ రాజ్‌పాల్ జాబితా అంతా పైనించి కిందికి ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాడు. సుమారు 50 మందిలో కన్‌దేశి ర్యాంక్ నలభై ఆరు. ఇక ఎవర్నీ ఏమీ అడగనక్కర్లేదు. ఉన్న యాభైమందిలో ఎ-గ్రేడ్ వచ్చిన వాళ్ళకే ప్రమోషన్. ఎ-గ్రేడ్ పది మందికే వస్తుంది లెక్క ప్రకారం.

"సరే ఈ పేపర్లు అన్నీ నేను ఇంకోసారి చూస్తాను. ఆ తర్వాత నిన్ను మళ్ళీ పిలుస్తాను" అన్న జి.ఎం. సందేశంతో అంబకుమార్ ఫైలు అక్కడ వదిలేసి నిష్క్రమించాడు.

❋ ❋ ❋

"రావచ్చా సర్" ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ సీనియర్ మేనేజర్ బారిక్ తలుపు ఓరగా నెడుతూ జనరల్ మేనేజర్ ఆఫీసులో ప్రవేశించాడు.

"కమిన్ బారిక్ కమిన్" రాజ్‌పాల్ బారిక్‌ను అనుమతిస్తూ కూర్చోమని కుర్చీచూపి సైగ చేశాడు.

"థాంక్యూ సర్" బారిక్ ఆశీనుడైనాడు.

"యస్ బారిక్, ప్రెస్ ఎంతవరకు వచ్చింది?" ఫార్మింగ్ ప్రెస్ బ్రేక్ డౌన్ అయి రెండు రోజులైంది. తిరిగి ప్రెస్ పనిచెయ్యటానికి ఇంకో రెండు రోజులు పట్టవచ్చు. ఈ విషయం ఇంతకుముందే తెలుసు రాజ్‌పాల్‌కి. అయినా ఈ టాపిక్ ఎందుకు మొదలు ఎత్తుకున్నాడో బారిక్‌కి అంతుపట్టలేదు.

"వర్క్ ప్రోగ్రెస్‌లో ఉన్నది సర్. అనుకున్న ప్లాను ప్రకారం మరో రెండు రోజుల్లో..."

"వాట్? ఇంకా రెండు రోజులా?" బారిక్ మాటలు మధ్యలోనే తుంచేసి గొంతు పెంచాడు జి.ఎం. "ఈ లోపల ప్రొడక్షన్ ఎంత నష్టమో నీకు తెలుసా?"

"యస్ సర్. కానీ ఈ ప్రోగ్రాం ఇంతకు ముందు అనుకున్నదే గదా"

"ఏం మేనేజర్‌వయ్యా బారిక్. ఇంతకంటే త్వరగా చెయ్యలేమంటే ఆ రోజు సరేనన్నాను. ఇదే జపాను వాళ్ళయితే నాలుగు రోజుల్లో అయ్యే పని మూడు రోజుల్లోనే ఇంకా వీలైతే రెండు రోజుల్లోనే పూర్తి చెయ్యటానికి ప్రయత్నం చేసి సాధిస్తారు. నువ్వు ట్రైనింగ్‌కు జపాన్ వెళ్లొచ్చావు కదూ!" మామూలుగా జనరల్ మేనేజర్‌కు తనంటే సదభిప్రాయం, తన అనుభవం మీద గౌరవం ఉన్నాయి. అలాంటది ఈ రోజు ఇలా ఎందుకు విరుచుకు పడుతున్నాడో బారిక్‌కి అంతుపట్ట లేదు. అయినా నాలుగురోజులు పని మూడు రోజుల్లో చేస్తానని హామీ ఇవ్వలేని పరిస్థితి.

"ఎస్ సర్. ప్రయత్నిస్తాం సర్" బయటపడే ప్రయత్నంలో బారిక్.

"ఏం ప్రయత్నమో ఏమో! నాకేం నమ్మకం లేదు" తన మీద జి.ఎం.కి నమ్మకం పోతుందనేసరికి బారిక్‌కి టెన్షన్ మొదలైంది.

"అవునూ ఈ కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు రాసింది నువ్వేనా?" ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ మేనేజర్ల రిపోర్టులు ఒక్కొక్కటే తీసి చూస్తూ బారిక్ సమాధానానికి ఎదురు చూడకుండా "ఏమిటి అందరికీ మార్కులు ఇలాగేనా? మిగతా డిపార్ట్‌మెంట్‌వాళ్ళ మార్కులకూ నీ డిపార్ట్‌మెంటులో నువ్వు ఇచ్చిన మార్కులకూ ఎంత తేడానో తెలుసా? నీ దగ్గర పనిచేసే వాళ్ళకు ప్రమోషన్లు అక్కర్లేదా?" వడగళ్ళ వానలో బారిక్‌కి బుర్ర తిరిగిపోతున్నది. జూనియర్ మేనేజర్ల రిపోర్టు తను మూడు సంవత్సరాల నుంచి రాస్తున్నాడు.

"ఇదేమిటి? కన్‌దేశికి నీకూ ఏమైనా పేచీ వచ్చిందేమిటి?" రిపోర్ట్‌లోంచి తలెత్తి సీరియస్‌గా అడిగాడు రాజ్‌పాల్.

"అబ్బె అలాంటిదేం లేదు సర్. అతని పెర్ఫార్మెన్స్..."

"బారిక్. కన్‌దేశి నాకు తెలుసునన్న విషయం నీకు తెలుసు. మనసులో ఏదో పెట్టుకుని పైకి రావల్సిన ఇంజనీర్ల భవిష్యత్తు ఇలా నాశనం చెయ్యటం" జి.ఎం. స్వరం చాలా గంభీరంగా ధ్వనించింది.

"లేదు సార్. నాకు అలాంటి ఉద్దేశ్యం ఎన్నడూ లేదుసార్" కంగారుగా బారిక్.

"కాకపోతే ఏమిటయ్యా ఇది? వృద్ధిలోకి రావల్సిన నీ సబార్డినేట్‌కు నువ్వు చేసే సహాయం ఇదేనా? కొంచెం మానవతా దృక్పథం ఉండాలయ్యా. ఈ గవర్నమెంటు ఉద్యోగాల్లో తోటివాళ్ళకు మనం ఏం సహాయం చెయ్యగలం? ప్రతిభ కలవాళ్ళకు అదనంగా జీతం ఇవ్వగలమా, ప్రమోషన్స్ త్వరగా ఇవ్వగలమా, లేకపోతే నెల జీతంతోబాటు అదనంగా బోనస్ ఇవ్వగలమా? ఏం చెయ్యగలం?" జనరల్ మేనేజర్ గంభీరోపన్యాసంతో బారిక్‌లో అలజడి.

"కరెక్ట్ సర్! గవర్నమెంట్ కంపెనీల్లో అదే బలహీనత" చెమట తుడుచుకుంటూ పేలవంగా శృతి కలిపాడు బారిక్.

"కాని ఇలాంటి రిపోర్ట్ రాసి వృద్ధిలోకి రావలసిన యువకుల భవిష్యత్తు పదడుగుల లోతున పాతెయ్యవచ్చు ఆ విషయం తెలుసనుకుంటాను."

"సర్ పదిమంది రిపోర్ట్‌లు రాసేటప్పుడు. అందరికీ మార్కులు ఒకే రకంగా రావనీ, ఆ కారణంగా కొందరు పైన కొందరు క్రింద ఉండాలిగదా" అనబోతున్న బారిక్ మాటలు గ్రహించి "ఐసీ.. రేపు నీ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ కూడా ఇలా ఉంటే నీకెలా ఉంటుంది?" బారిక్ కళ్ళలోకి సూటిగా చూస్తూ సైలెన్సర్ వదిలాడు జనరల్ మేనేజర్.

"లేదు సర్. . . నా ఉద్దేశ్యం.."

"నీ ఉద్దేశ్యం ఏమిటో ఈ కన్‌దేశి కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ చెబుతోంది. రేపు నీ సి.సి.ఆర్. రాసినవాడు ఇలాగే రాసి నా ఉద్దేశ్యం అదికాదు అంటే.." తన సి.సి.ఆర్ (కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్) ఎవరు రాస్తారో బారిక్‌కు ఎవరూ చెప్పక్కర్లేదు. ఆ ముసళ్ళ పండగ తప్పించుకోవాలంటే ప్రస్తుత కర్తవ్యం?

"మీరే చెప్పండి సర్. మీరు ఎలా చెయ్యమంటే అలా చేస్తాను."

"నేను చెప్పటం నువ్వు చెయ్యటం కాదు. ఒక బాధ్యతగల సీనియర్ మేనేజర్‌గా, నీతో పనిచేసేవాళ్ళందరినీ ఒక తాటిమీద నడపవలసిన లీడర్‌గా నీతోటి జూనియర్ ఉద్యోగికి అన్యాయం జరగకుండా ఉండాలంటే ఏం చెయ్యాలనుకుంటున్నావో అది చెయ్యి."

"యస్ సర్, మీరు సరేనంటే కన్‌దేశి రిపోర్టు మళ్ళీ రాస్తాను.. సర్."

"నేను సరేననటంగాదు. ఎలా చేస్తే మానవతా దృక్పథంతో ఉంటుంది? ఎవరికీ అన్యాయం జరగదు. అందరికీ మేలు జరుగుతుంది అని నీకు తోస్తే అలా చెయ్యి. నేనేదో స్వార్థంతో బలవంతాన నిన్నీపని చెయ్యమనటం లేదు. నీకు మనస్ఫూర్తిగా ఎలా చెయ్యాలని తోస్తే అలా చెయ్యి. అంతే" జనరల్ మేనేజర్ ఉపన్యాస ధోరణిలో ముగించాడు.

"అందరికీ మేలు ఎలా జరుగుతుందో గ్రహించిన బారిక్ "సార్ కన్‌దేశి కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ కరెక్ట్ చేసి రాస్తాను సర్. ఎక్కడో. పొరపాటు జరిగుంటుంది" అన్నాడు.

"ఓకె. నీవు పొరబాటు జరిగిందనుకుంటే సరే. నీ ఇష్టం."

"కానీ సర్ ఈ ఖాళీ సిసిఆర్ ఫార్మ్ మనిషి కొక్కటేనన్నారు సర్." సమస్య వెలిబుచ్చాడు బారిక్.

"నో ప్రాబ్లెమ్. నేను చెప్పానని అంబ కుమార్‌కు చెప్పు" సమావేశం ముగిసినట్లు వెళ్ళిరమ్మని సిగ్నల్ ఇచ్చాడు జనరల్ మేనేజర్ రాజ్‌పాల్.

"ప్రెస్ వీలయినంత త్వరలో" మొదటి సమస్యకు పరిష్కారం వెదుకుతూ నీళ్ళు నమిలాడు బారిక్.

"ఓకె.ఓకె.. మీరు సాధ్యమయినంత ప్రయత్నం చెయ్యండి" భారం తగ్గి ఒక దీర్ఘ నిశ్వాసం వదిలి బయటపడ్డాడు బారిక్.

✵ ✵ ✵

"సార్ మిమ్మల్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిలుస్తున్నారు" ప్రొడక్షన్ లైన్‌లో ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతున్న శర్మకు ఇంటర్‌కాంలో సందేశం వచ్చింది.

"చాలా జాగ్రత్తగా చూడు. స్పెసిఫికేషన్స్ అన్నీ డబుల్ చెక్ చెయ్. శాంపిల్ సైజు రెట్టింపు చెయ్యి" అని ఇన్‌స్పెక్టర్ డేనియల్‌కు ఇన్‌స్ట్రక్షన్ ఇచ్చి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆఫీసుకు బయలుదేరాడు శర్మ. ఆఫీసులో ప్రవేశిస్తుండగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.ఏ. అబ్రూ, శర్మను చూసి భావగర్భితంగా నవ్వి లోపలికి వెళ్ళవచ్చున్నట్లు సైగ చేశాడు.

"కమిన్ శర్మ కమిన్" ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామచంద్రం శర్మను లోపలికి ఆహ్వానించి కూర్చోమన్నట్లు కుర్చీ చూపించాడు.

"ఊ.. శర్మగారూ ఈ నెల మన ప్రొడక్షన్ క్వాలిటీ ఎలా వుంది?"

"గత మాసంకన్నా మెరుగేసర్. ఈ నెల దిగుబడి 90 శాతం దాటుతుంది" శర్మ ధైర్యంగా ఆశాభావం వెలిబుచ్చాడు.

"నువ్వేమో ధైర్యంగానే ఉన్నావు. ఫోర్డ్


చదవండి! చదివించండి!!

ఆటవిడుపు

పిల్లల సచిత్ర మాస పత్రిక




జూన్ 2004 సంచిక

విజ్ఞాన వినోదాల విపంచిక

కంపెనీ కంప్లెయింట్ ఒక చిక్కు ప్రశ్న అయి కూచుంది. ఇందులో నుంచి గట్టెక్కటం" ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తన వాక్యం పూర్తి చెయ్యక మునుపే,

"అదేం అంత గడ్డు సమస్య కాదు సార్. దాని సంగతి నేను చూస్తాను" శర్మ తను ఈ సమస్య పరిష్కారం నిమిత్తం ఫోర్డ్ కంపెనీకి వెళ్తున్నాననే విషయాన్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుకు చెప్పకుండానే చెబుతూ ధైర్యం వెలిబుచ్చాడు.

"ఏమి చూడటమో ఇన్ని రోజులుగా పనిచేస్తున్నా మన దిగుబడి మన కొలాబరేటర్స్ లెవెల్‌కి రాలేదు" ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిరాశా భావం వెలిబుచ్చడం శర్మకు బాక్సింగ్ పంచ్‌లా తగిలింది.

"మనం ప్రొడక్షన్ ఆరంభించి మూడు సంవత్సరాలే గద సార్. మన కొలాబరేటర్స్ ముప్ఫై సంవత్సరాల నుంచి అనుభవం సంపాదించారు. ఈ మూడు సంవత్సరాలలో మనం సాధించిన ప్రగతిని మన కొలాబరేటర్సు ఎంతో మెచ్చుకున్నారు గద సార్."

"కరెక్ట్. అందుకే మనం ఈ విషయం క్షుణ్ణంగా వాళ్ళతో చర్చించి అందులో రహస్యం తెలుసుకోవాలి."

"యస్ సర్ తప్పకుండా!" శర్మ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో శృతి కలిపాడు.

"ఎల్లుండి హ్యుండాయ్ టెక్నికల్ డైరెక్టర్ ఢిల్లీ వస్తున్నారు. ఇంత క్రితమే మన టెక్నికల్ డైరెక్టర్ ఫోన్ చేశారు. ఎంతో శ్రమ మీద అతనిని మన దిగుబడి గురించిన చర్చలకు ఒప్పించారు. నువ్వు హ్యుండాయ్ కంపెనీ టెక్నికల్ డైరెక్టర్‌తో కూలంకషంగా చర్చించి వాళ్ళెలా అంత దిగుబడి సాధిస్తున్నారో, అంతే దిగుబడి సాధించటానికి మనం ఏం చెయ్యాలో అంతా తెలుసుకోవాలి. రేపు సాయంత్రానికి నువ్వు ఢిల్లీలో ఉండాలి సరేనా?"

"కానీ సర్" శర్మ నీళ్ళు నమిలాడు.

"ఏమిటి శర్మ? ఎనీ ప్రాబ్లెమ్?"

"రేపు రాత్రి నేను ముంబయి వెళ్తున్నాను సర్. అక్కడ్నించి డెట్రాయిట్" మీకు తెలుసు గదా అన్నట్లు నీరసంగా పేలవంగా ఆశాజ్యోతి వెతుకుతూ అన్నాడు శర్మ.

"ఓ అదా.. ఆ కంప్లెయింట్ విచారణ కన్నా మన కంపెనీ భవిష్యత్తుకు సోపానం వేసే ఈ చర్చలు చాలా ముఖ్యం. ఏమంటావ్? ఫోర్డ్ కంపెనీ కంప్లెయింట్ విషయం నాకొదిలెయ్ ఒకె?"

"యస్ సర్" దెబ్బతిన్న శర్మ స్వరం నూతిలో నుంచివచ్చినట్లు వెలువడింది.

"అన్ని వివరాలూ తెలుసుకుని కూలంకషంగా చర్చించటానికి సిద్ధమై బయలుదేరు. అవసరమైతే ఇంకోరోజు ఉండి అంతా తెలుసుకునిరా." సమావేశం ముగిసిందన్న సూచనగా లేచి ఎటాచ్‌డ్ బాత్‌రూమ్‌వైపు నడిచాడు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.

శర్మ అపస్మారక స్థితిలో నిద్రలో నడుస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆఫీసు నుంచి బయటికొచ్చాడు. తన ఎదురుగా ఎవరు వస్తున్నారో, తను ఎటు వెళ్తున్నాడో గమనించే స్థితిలో లేడు శర్మ. తను ఇన్ని రోజులు పడిన శ్రమ, సంపాదించిన విజ్ఞానం, గడించిన అనుభవం అన్నీ కలిసి తనను ఒక విశిష్ట స్థానంలో నిలిపినై. ఆ గుర్తింపుతోనే ఈనాడు కంపెనీ సమస్య పరిష్కరించడానికి తనకు అమెరికా వెళ్ళే అవకాశం వచ్చింది. ఈ అవకాశం తన సమర్థతకు ఒక ఆమోద ముద్ర.

తను మరో ఇరవై నాలుగు గంటల్లో బయలుదేరబోతుండగా తన గుర్తింపు, సమర్థత అన్నీ అరేబియా సముద్రంలో కలిసిపోయినై. తన ఆశల బెలూన్‌కు పంచర్ పడింది. తను ఊహించలేని ఎదురు దెబ్బ. ఎలా వొచ్చి తన ఆఫీసు చేరాడో శర్మకు తెలియదు.

❋ ❋ ❋

నాలుగు రోజులు ఢిల్లీ టూర్‌నుంచి తిరిగి వచ్చిన శర్మ, తను ఢిల్లీ చేరిన మర్నాడు టెక్నికల్ డైరెక్టర్ ఆఫీసుకు వెళ్లగా తమ టెక్నికల్ డైరెక్టర్ హ్యుండాయ్ కంపెనీ డైరెక్టరుతో కలిసి ఆగ్రా వెళ్తూ తనను వాళ్ళకోసం నిరీక్షించమన్నారనీ, మరుసటి రోజు పాలస్ ఆన్ వీల్స్‌లో జయపూర్‌వెళ్తూ వాళ్ళు తిరుగు రాకకోసం తనను నిరీక్షించమన్నారనీ, మూడో రోజు అర్జంట్ కాల్ వస్తే హ్యుండాయ్ డైరెక్టరు సింగపూర్ వెళ్ళాడనీ జనరల్ మేనేజర్ రాజ్‌పాల్‌కు నివేదించటానికి జనరల్ మేనేజర్ ఆఫీసుకు వెళ్ళగా "జి.ఎం. టూర్ వెళ్ళారు గదు సార్" అన్నాడు పి.ఏ. రామచంద్రం "ఈ విషయం మీకు తెలియదా?" అన్న భావంతో.

"టూర్? ఎక్కడికీ?" శర్మ ప్రశ్న.

"డెట్రాయిట్ ఫోర్డ్ కంపెనీకి" పి.ఏ. సమాధానం. శర్మ కొయ్యబారిపోయాడు. సాంకేతిక విజ్ఞానం, సంవత్సరాల అనుభవం, సమర్థత అన్నీ కళ్ళముందు మతిపోయినట్లు గిరగిర తిరుగుతున్నాయి. కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించి గోడకు ఆనుకుని స్థిమితపడే ప్రయత్నంలో ఉండగా,

"స్వీట్ తీసుకోండి సార్. నాకు ప్రమోషన్ వచ్చింది" అంటూ స్వీట్ పాకెట్ అందిస్తున్న కన్‌దేశి మాట వినే స్థితిలో లేడు శర్మ.


❋ ❋ ❋

రెండునెల్ల తర్వాత ఫోర్డ్ కంపెనీకి తమ కంపెనీ ఒకటిన్నర కోటి నష్టపరిహారం చెల్లించింది అని తెలిసిన శర్మకు ఒళ్లంతా కుతకుతలాడిపోయింది. మూడు కోట్ల నష్టపరిహారాన్ని ఒకటిన్నర కోటికి తగ్గించినందుకు జి.ఎం. రాజ్‌పాల్‌కు ప్రశంసా పత్రంతో బాటు ప్రమోషన్ అని వినికిడి. ❋

*(ఈ కథలోని పాత్రలు కంపెనీల పేర్లు ఊహాకల్పితం. ఎవ్వరికీ సంబంధించినవి కావని గమనించాలి. - రచయిత)*

## వి'చిత్ర' వ్యాఖ్య పోటీ ఫలితం - 18

మేము ప్రారంభించిన వి'చిత్ర' వ్యాఖ్య పోటీలో మా ఊహకు మించి పాఠకులు పాల్గొని వ్యాఖ్యలు పంపారు. అందరికీ మా అభినందనలు. మాకు వచ్చిన (19-05-2004 సంచిక) వ్యాఖ్యలలో ఈ క్రింది వ్యాఖ్యను ఉత్తమంగా ఎన్నిక చేయడమైనది.



"రక్షణాధికారిపైనే పాదరక్షతో ప్రహారం
కక్ష సాధింపుకైనా చేయరాని దుస్సాహసం"

**పంపినవారు**

కె. వైశాలి, రాజమండ్రి

*వీరికి ప్రియదత్త వారపత్రిక మూడు మాసాల పాటు అందజేస్తాము. - ఎడిటర్*